తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
19-04-2024
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 243 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889

## ఈ ప్రభుత్వాన్ని బీజేపీ వదిలిపెడుతుందా?
# 20 మంది ఎమ్మెల్యేలతో వస్తానంటే వద్దని చెప్పా..!
### కేసీఆర్ కీలక వ్యాఖ్యలు

...మిగతాది 2 లో



**పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన వారు కొందరు బాధపడుతున్నారని.. ఓ సీనియర్ నేత తనని సంప్రదించారని పార్టీ నేతలతో చెప్పారు.**

## తమిళనాడులోనే రాహుల్ కి మద్దతు

» దేశవ్యాప్తంగ మోడీనే కోరుకుంటున్న జనం



**జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:**

2024 లోక్సభ ఎన్నికల తేదీ ప్రకటించగానే ఈసారి ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? ఎవరు ఓడిపోతారు అనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇంతలో డెయిలీ హంట్ ఒక సర్వే నిర్వహించింది. ఓ వైపు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తుంటే, మరోవైపు ఏ పార్టీ అధికారంలోకి రావాలి, తాము ఎన్నికునే అభ్యర్థి ఎవరు అన్న దానిపై జనం కూడా లెక్కలేసుకుంటున్నారు. ప్రజల నాడిని తెలుసుకునేందుకు ప్రయత్నించింది. ఇందుకోసం 11 భాషా ప్రాతిపదికన దాదాపు 77 లక్షల మందిని ఇంటర్వ్యూ చేశారు. వీరందరినీ వివిధ రకాల ప్రశ్నలు అడిగారు. దాని ఆధారంగా ఒక నివేదికను రూపొందించారు.రాష్ట్రాల వారీగా

...మిగతాది 2 లో

## సౌత్ 130లో 15 బీజేపీకి

» రేవంత్ జోస్యం



**జయభేరి, తిరువనంతపుర్, ఏప్రిల్ 18:**

లోక్ సభ ఎన్నికల సమరం తారస్థాయికి చేరింది.. ప్రధాన పార్టీలన్నీ ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. మూడోసారి అధికారం కోసం బీజేపీ, ఎలాగైనా పట్టు సాధించాలని కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఈ తరుణంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేరళలో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి ఓ జాతీయ ఛానెల్ తో మాట్లాడుతూ.. దక్షిణాదిలో బీజేపీ ప్రభావం ఉండదంటూ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని 130 లోక్సభ స్థానాల్లో 15 కంటే తక్కువ స్థానాల్లో విజయం సాధిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు.2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు కేరళ.. తమిళనాడు, తెలంగాణ, ఏపీలో ఇలా అన్ని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి బీజేపీ.. దక్షిణాది రాష్ట్రాలలో తన ఉనికిని విస్తరించేందుకు సర్వశక్తులు ఒడ్డింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా రంగంలోకి దిగి.. గత కొన్ని వారాల నుంచి ఆ రాష్ట్రాలలో వరుస పర్యటనలు చేశారు.ఈ క్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సౌత్ ఇండియాలోని 130 సీట్లలో ఇండియా కూటమి 115 - 120 మధ్య కైవసం చేసుకుంటుందని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు. బీజేపీ ఓడించే ప్రయత్నంలో ఇది కీలకంగా మారుతుందని తెలిపారు.



## సండే.. నాన్ వెజ్ లవర్స్ కు షాక్

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 18:**

ఆదివారం వచ్చిందంటే ఇళ్లలో నాన్ వెజ్ వంటల ఘుమఘుమలాడుతుంటాయి. ఇక హైదరాబాద్ లో అయితే ఆదివారం చికెన్, మటన్ షాపుల ముందు రద్దీ కనిపిస్తుంది. వారం అంతా డ్యూటీలు, ఇతర పనులతో బిజీ బిజీగా ఉండే నగర వాసులు ఆదివారం... ఓ ముక్క, అలవాటుంటే సాయంత్రం ఓ చుక్క వేసుకుంటారు. దీంతో ముఖ్యంగా ఆదివారం నాన్ వెజ్ విక్రయాలు అధికంగా ఉంటాయి. కానీ హైదరాబాద్ వాసులకు ఓ చిన్న బ్యాడ్ న్యూస్... ఏంటంటే వచ్చే ఆదివారం(ఏప్రిల్ 21)న సిటీలో నాన్ వెజ్ దొరకదు. చికెన్, మటన్, ఇతర నాన్ వెజ్ విక్రయాలు ఉండవు. కారణంగా ఏంటంటే... మహావీర్ జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని కబేళాలతో పాటు అన్ని మాంసం దుకాణాలను వచ్చే ఆదివారం మూసివేయాలని

...మిగతాది 2 లో


# ఎన్నికల సమరం
## తొలి రోజే భారీగా నామినేషన్లు



తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియకు కీలక ఘట్టం మొదలైంది. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియప్రారంభమైంది. ఏపీలోని 25 లోక్సభ నియోజక వర్గాలతో పాటు, 175 అసెంబ్లీ నియోజక వర్గాల్లో అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా... తొలి రోజు(ఏప్రిల్ 18) పలువురు అభ్యర్థులు నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన తొలి రోజున ఖమ్మం ఎంపీ స్థానానికి తొలి నామినేషన్ దాఖలయింది. ఆధార్ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా కుక్కల నాగయ్య గురువారం ఒక సెట్ నామినేషన్ ను ఖమ్మం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్ కు అందజేశారు. మొదటి రోజు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్ల ప్రక్రియకు దూరం ఉండగా.. కొందరు అభ్యర్థులు మాత్రమే ముందుకొచ్చి నామినేషన్లు వేశారు. కాగా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ముహూర్తాలు చూసుకుంటున్నట్లు తెలుస్తోంది. మంచి రోజులు, శకునాలు చూసుకుని నామపత్రాలు దాఖలు చేసేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే కొంతమంది ముహూర్తాలు ఖరారు చేసుకోగా.. ఆయా తేదీల్లో వారివారి పార్టీల పెద్దల సమక్షంలో నామినేషన్

...మిగతాది 2 లో

## బస్టాండ్ లో నిలువు దోపిడి




**తెలంగాణలో హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్దది కరీంనగర్ బస్టాండ్ అని తెలిసిందే. మరి అలాంటి కరీంనగర్ బస్టాండ్లో ప్రయాణికుల నుంచి వ్యాపారస్తుల నిలువు దోపిడి సాగుతుందా...? అంటే అవునని వినిపిస్తోంది. స్పెషల్ స్టోరీ...**

...మిగతాది 2 లో




## దూరమౌతున్న కేడర్ నిలబెట్టుకోనేదలా..

**జయభేరి, హైదరాబాద్, వరంగల్, ఏప్రిల్ 18:**

బీఆర్ఎస్ పార్టీకి పునర్ వైభవం తీసుకొస్తామని అధిష్టానం పదేపదే చెబుతున్నా ఆ దిశగా అడుగు ముందుకు పడటం లేదు. పార్టీకి గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పూర్తిస్థాయి కమిటీలు లేవు.. జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించినా కేడర్కు శిక్షణ కార్యక్రమాలు చేపట్ట లేదు. దీంతో పార్టీ కార్యాలయాలన్నీ నిరూపయోగంగానే మారాయని పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు.కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ పార్టీ నిర్మాణంపై దృష్టిసారించలేదు. గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయలేదు. దీంతో అధికారం కోల్పోగానే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి

...మిగతాది 2 లో



## కన్నారావుతో సహా ఐదుగురి మీద కేసు

**జయభేరి, రంగారెడ్డి:**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దగ్గరి బంధువు కన్నారావుతో సహ ఐదుగురిపై కేసు నమోదు అయింది. గెస్ట్హౌస్లో నిర్బంధించి, కొట్టి 60 లక్షలనగదు, 97 తులాల బంగారం దోపిడీ చేసినట్లు పిర్యాదు. బిందు మాధవి అలియాస్ నందిని చౌదరి అనే మహిళతో కలిసి చేసిన అరాచకం ఇది. న్యాయం కోసం కన్నరావు వద్దకు సాఫ్ట్ వేర్ ఉద్యోగి విజయ వర్ధన్ రావు వెళ్లాడు. అతడి వద్ద నగలు..నగదు ఉన్నాయ్ అని తెల్సుకుని నందిని చౌదరి స్కెచ్ వేసింది కన్నారావు, శ్యామ్ ప్రసాద్ లతో కలిసి పక్కా ప్లాన్ వూసింది టాస్క్ ఫోర్స్ అధికారి భుజంగ రావు . ఏసిపి కట్టా సాంబయ్య తమకు క్లోజ్ అంటూ బెదిరింపులకు దిగారు. బాధితుడి ఫిర్యాదుతో బంజారా హిల్స్ పోలీసులు కన్నారావుతో సహా ఐదుగురిపై కేసు నమోదు చేసారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## 20 మంది ఎమ్మెల్యేలతో..

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. ఇప్పటికే అన్నిస్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆయన... ప్రచారంపై కూడా దృష్టిపెట్టారు. అయితే ఇవాళ హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో కేసీఆర్ అధ్యక్షతన పార్లమెంట్ ఎన్నికల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. పార్టీ అభ్యర్థులకు బీఫామ్ లు అందజేశారు కేసీఆర్. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మనుగడ సాధించటం కష్టమే అనిపిస్తోందని కేసీఆర్ అభిప్రాయపడ్డారని తెలిసింది. "నాడు బీఆర్ఎస్ పార్టీకి వంద మందికిపైగా ఎమ్మెల్యేలు ఉండగానే...సర్కార్ ను పడగొట్టేందుకు బీజేపీ యత్నించింది. అలాంటిది మ్యాజిక్ ఫిగర్ కు దగ్గరగా 64 మంది ఎమ్మెల్యేలతో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉండనిస్తారా..?" అని నేతలతో అన్నట్లు సమాచారం.
ఇక ఇదే సమావేశంలో పార్టీ మారుతున్న వారి విషయంలో కూడా సంచలన విషయాలను బయటపెట్టారు కేసీఆర్. కాంగ్రెస్ లోకి వెళ్లినవారు బాధపడుతున్నారని... అక్కడ పరిస్థితి ఏం బాగాలేదని చెప్పారని నేతలతో కేసీఆర్ అన్నట్లు తెలిసింది. అంతేకాకుండా కాంగ్రెస్ లోని ఓ సీనియర్ నాయకుడు తనని సంప్రదించారని కేసీఆర్ చెప్పటం ఇప్పుడు అతిపెద్ద సంచలనంగా మారింది. బీఆర్ఎస్‌ని వీడి కాంగ్రెస్‌లోకి వెళ్తే ఇక్కడ అంతా బీజేపీ కథ నడుస్తుందని సదరు సీనియర్ నేత చెప్పినట్లు కేసీఆర్ నేతలతో అన్నారట..! "ఇరవై మంది ఎమ్మెల్యేలను తీసుకొని రావాలా సార్ అని నన్ను సంప్రదించాడు, కానీ ఇప్పుడే వద్దని చెప్పాను" అని కేసీఆర్ అన్నట్లు తెలిసింది. ఇక ఎన్నికలపై మాట్లాడుతూ... వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 8 స్థానాలకు పైగా బీఆర్ఎస్ గెలవబోతుందని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు.గట్టిగా పోరాడితే మరో మూడు స్థానాలను కూడా కైవసం చేసుకోవచ్చని అన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయం గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని కూడా కేసీఆర్ అభిప్రాయపడ్డారు. రాబోయే రోజులు మనవేనంటూ నేతలను ఉద్దేశించి మాట్లాడారు.ఉద్యమ కాలం నాటి కేసీఆర్‌ను మళ్లీ చూస్తారని కూడా వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో కవిత అరెస్ట్ తో పాటు ఎమ్మెల్యేల కొనుగోలు అంశాన్ని కూడా కేసీఆర్ నేతల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. ఇప్పటికే పలు సభలను నిర్వహించింది బీఆర్ఎస్. పార్టీలో జోష్ నింపే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు కేసీఆర్ బస్సు యాత్ర కు సిద్ధమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ పర్యటించేలా ప్లాన్ చేస్తున్నారు. ఆ దిశగా బీఆర్ఎస్ నాయకత్వం కార్యాచరణను సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈ బస్సు యాత్రలో భాగంగా ఎండి పంట పొలాలను పరిశీలించటంతో పాటు రోడ్ షోలలో కూడా పాల్గొనున్నారు. ఉదయం 11 వరకు పొలం బాట చేపట్టాలని యోచిస్తున్నారు. సాయంత్రం నుంచి ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు మూడు చోట్ల రోడ్డు షోలు తలపెట్టాలని చూస్తున్నారు. మరోవైపు సిద్దిపేట, వరంగల్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభలను నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది.

## తొలి రోజే భారీగా నామినేషన్లు

వేసేందుకు రెడీ అవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా.. అందులో మహబూబాబాద్ నియోజకవర్గం ఎస్టీ రిజర్వ్‌డ్. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి బలరాం నాయక్, బీజేపీ నుంచి సీతారాం నాయక్, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత పోటీ చేస్తున్నారు. కాగా మొదటి రోజు నామినేషన్ వేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులెవరూ ముందుకు రాలేదు. ఒకే ఒక స్వతంత్ర అభ్యర్థి మాత్రం నామినేషన్ దాఖలు చేశారు. మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామ శివారు గుర్రపు తండాకు చెందిన బానోత్ లింగ్యా నాయక్ నామినేషన్ దాఖలు చేయగా.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్ అద్వైత్ కుమార్ సింగ్ కు ఒక సెట్ నామపత్రాలు అందజేశారు. దీంతో మొదటిరోజైన గురువారం ఒకే ఒక నామినేషనల్ దాఖలైనట్లయ్యింది. వరంగల్ పార్లమెంటు పరిధిలో మొదటి రోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ ప్రధాన పార్టీల్లో బీఆర్ఎస్ నుంచి డాక్టర్ మారపెల్లి సుధీర్ కుమార్, బీజేపీ నుంచి అరూరి రమేశ్, కాంగ్రెస్ నుంచి కడియం కావ్య బరిలో నిలిచారు. కాగా మొదటి రోజు నామినేషన్ వేసేందుకు వారెవరూ ముందుకు రాలేదు. కాగా అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ నుంచి అంబోజు బుద్ధయ్య, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి తౌటపెల్లి నర్మద, ఇండిపెండెంట్ గా బరిగెల శివ నామినేషన్ వేశారు. ఈ మేరకు రిటర్నింగ్ ఆఫీసర్ ప్రావీణ్యకు నామపత్రాలను అందజేశారు.
తొలి రోజు కరీంనగర్ లో రెండు నామినేషన్ లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా కోట శ్యామ్ కుమార్, పొత్తూరి రాజేందర్ నామినేషన్ లు దాఖలు చేశారు. మరో ఇద్దరు నామినేషన్ పత్రాలు లేక వెనుతిరిగారు. పెద్దపల్లిలో నలుగురు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా దూరం మహిపాల్, నూకల నవీన్, డి.రాజ్ కుమార్, అక్కపాక తిరుపతి నామినేషన్ ధాఖలు చేశారు. తొలి రోజు ప్రధాన పార్టీల నుంచి ఎవ్వరు నామినేషన్ దాఖలు చేయలేదు. 19న కరీంనగర్ లో బిజెపి అభ్యర్థి బండి సంజయ్ తరపున వారి కుటుంబ సభ్యులు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. అదే విధంగా పెద్దపల్లిలో మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ, బిఆర్ఎస్ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్, బిజెపి అభ్యర్థిగా గోమాస శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. 20న కరీంనగర్ లో బిఆర్ఎస్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్ కుమార్ నామినేషన్ దాఖలు చేస్తారు. ఇక మల్కాజ్ గిరి నుంచి బీజేపీ తరుపున ఈటల రాజేందర్ పోటీ చేస్తుండగా... ఆయన ఇవాళే నామినేషన్ దాఖలు చేశారు. మెదక్ స్థానం నుంచి రఘునందన్ రావు నామినేషన్ దాఖలు చేశారు. మహబూబ్ నగర్ స్థానం నుంచి బీజేపీ తరపున డీకే అరుణ కూడా ఇవాళే నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో గోవా ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రేపు కిషన్ రెడ్డితో పాటు ఖమ్మం అభ్యర్థి కూడా బీజేపీ తరపున నామినేషన్లు దాఖలు చేయనున్నారు. మరోవైపు బీఆర్ఎస్ తరపున పోటీ చేసే అభ్యర్థులకు ఇవాళే బీఫారమ్ లు అందాయి. వారి కూడా ముహూర్తం చేసుకొని నామినేషన్లు సమర్పించనున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ లోనూ తొలిరోజు పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. అధికార వైసీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పలువురు అభ్యర్థులు తొలిరోజే నామినేషన్లను సమర్పించారు. అన్నిచోట్ల కూడా ఉదయం 11 గంటలకే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఒంగోలు తెదేపా అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి నామినేషన్ వేశారు.

## దూరమౌతున్న కేడర్..

వరకు నేతలంతా ఇతర పార్టీల్లోకి వలస వెళ్తున్నారు. దీంతో గ్రామస్థాయిలో పార్టీ ఖాళీ అవుతుంది. దీనిని నివారించేందుకు గ్రామస్థాయి నుంచి కమిటీలు, అనుబంధ కమిటీలు వేసి, శిక్షణ కార్యక్రమాలు చేపడితేనే పార్టీ బలోపేతంతో పాటు పునర్నిర్మాణం జరిగి పార్టీ మనుగడ ఉంటుందని, లేకుంటే కష్టమేనని పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. అయితే పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ పటిష్టతకు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది బీఆర్ఎస్ పార్టీని 2001లో స్థాపించారు. నాటి నుంచి 2014వరకు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాన్ని కొనసాగించింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చింది. రెండేళ్ల క్రితం పార్టీ సభ్యత్వాలు సైతం చేసి అత్యధిక సభ్యత్వాలు ఉన్నపార్టీ బీఆర్ఎస్ అని పార్టీ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు.కానీ పార్టీ పటిష్టతపై మాత్రం దృష్టిసారించలేదు. గ్రామశాఖ అధ్యక్షుడిని మాత్రమే నియమించి పూర్తి స్థాయి కమిటీలతో పాటు అనుబంధ కమిటీలను సైతం నియమించలేదని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ అన్ని గ్రామాల్లో కమిటీలు వేయాలని, సోషల్ మీడియా కమిటీని సైతం నియమించి యాక్టీవ్ గా పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆదిశగా చర్యలు చేపట్టలేదని సమాచారం. ఎమ్మెల్యే అనుకూలవర్గానికే గ్రామకమిటీ అధ్యక్షుడిగా నియమించడంతో మిగతావారంతా గుర్రుగా ఉండటంతో కొన్ని కమిటీలను వేయలేదని సమాచారం. ఇదే పరిస్థితి నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కొనసాగుతోంది. ఆ గ్రూపులే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణమైందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నూతన రాష్ట్ర కమిటీ కూర్పుపై కసరత్తు ప్రారంభించినప్పటికీ ఎవరికైనా కమిటీలో అవకాశం రాకపోతే వ్యతిరేకత వస్తుందని భావించి వెనక్కి తగ్గినట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర కమిటీలో 67 మంది సభ్యులతో జంబో కమిటీ ఉంది. ఆ కమిటీలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు కీలక సీనియర్ నేతలకు మాత్రమే అవకాశం కల్పించారు. పార్టీ అధ్యక్షుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడితో సహా 20 మంది ప్రధాన కార్యదర్శులు, 33 మంది కార్యదర్శులు, 12 మంది సంయుక్త కార్యదర్శులున్నారు. ఆ కమిటీలో సెక్రటరీ జనరల్గా పనిచేసిన కేకే పార్టీ మారారు. సీనియర్ నేతలు మంద జగన్నాథం, కడియం శ్రీహరి, మధన్ రెడ్డి, పి.రాములు, బీబీపాటిల్, కూచుకుళ్ల దామోదర్ రెడ్డి ఇలా పలువురు రాష్ట్రకమిటీలో ఉండగా ప్రస్తుతం వారంతా పార్టీ మారారు. వీరి పోస్టులు ఖాళీ అయ్యాయి. పార్టీ కేడర్ను ఎప్పటికప్పుడు యాక్టీవ్ చేసేందుకు పార్టీ అధిష్టానం అన్ని జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మించింది. నియోజకవర్గాల వారీగా నేతలకు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొంది. శిక్షణ మాటలకే పరిమితం అయింది. పార్టీ కేడర్కు మార్గనిర్దేశం చేసే నాయకుడే కరువయ్యారని, పార్టీ ఏం చేపడుతుందో అర్థం కావడం లేదని, మనోధైర్యం నింపే పార్టీ నేత కరువయ్యారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# బస్టాండ్ లో నిలువు దోపిడి

✍ జయభేరి, కరీంనగర్ :

కరీంనగర్ బస్టాండ్ మీదుగా రోజూ కొన్ని వందల బస్సులు వెళుతూ ఉంటాయి. నిత్యం వేలాదిమంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు ప్రేమ్ నగర్ ఆర్టీసీ బస్టాండ్ కు చేరుకుంటారు. బస్సుల కోసం వేచి చూసే ఆ ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండులో కొనే నీళ్ల నుంచి ఆహార పదార్థాల వరకూ వారిని నిలువు దోపిడీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మార్పీ కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేస్తూ ప్రయాణికులను మోసం చేస్తున్నారు. నాసిరకమైన తినుబండారాలను విక్రయిస్తూ ప్రయాణికుల ఆరోగ్యంతో సైతం ఆడుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఇదేంటి అని ప్రశ్నిస్తే నాకు తెలియదు, ఓనర్ను అడగాలని షాపుల్లోని వారు చెబుతున్నారు. కరీంనగర్ బస్టాండ్ లోని దుకాణాల్లో అధిక వసూళ్లు, నాసిరకమైన అమ్మకాలపై ఏబీపీ దేశం స్పెషల్ స్టోరీ...
కరీంనగర్ బస్టాండ్ లో మొత్తం 40 వరకు దుకాణాలు ఉండగా ప్రతిరోజూ సుమారు వందల బస్సులు వేల ట్రిప్పులు వేస్తుంటాయి. నిత్యం రెండు లక్షలకు పైగా ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుంటారు. ఈ బస్టాండ్ లోని దుకాణాలలో వాటర్ బాటిల్స్, సమోసాలు, మిర్చీలు, చిప్స్, బిస్కెట్ ప్యాకెట్లు ఇతర తిను బండారాలు సహా కూల్ డ్రింక్స్ విక్రయిస్తుంటారు. అసలే వేసవికాలం కావడంతో బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు లైట్ స్నాక్స్ తీసుకుందామని తిను బండారాలు కొన్నా, దాహంగా ఉందని కూల్




డ్రింక్స్, వాటర్ బాటిల్స్ కొన్నా.. అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మరోవైపు నాసిరకమైన ఉత్పత్తులను విక్రయిస్తూనే ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కొరిక్యల గ్రామానికి చెందిన ఓ ప్రయాణికుడు సిద్దిపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దాహం వేసి కరీంనగర్లోని బస్టాండ్ లో కూల్ డ్రింక్ తీసుకున్నాడు. కానీ ఎమ్మార్పీ కంటే పది రూపాయలు ఎక్కువ తీసుకుంటున్నారు. అదేంటి అని అడిగితే ఇక్కడ ఇలాగే విక్రయిస్తామని దుకాణదారుడు అన్నారని ప్రయాణికుడు తెలిపారు. మరో ప్రయాణికుడు కరీంనగర్ నుంచి హైదరాబాదుకు వెళ్లే తన స్నేహితులను బస్సు ఎక్కించేందుకు వచ్చాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో బస్టాండ్ లోని ఓ షాపు వద్దకు వెళ్లి మూడు కూల్ డ్రింక్స్ తీసుకోగా ఒక్కో దానిపై పది రూపాయలు ఎక్కువ తీసుకున్నారని తెలిపారు. దీనిపై ప్రశ్నించేవారు లేరా ఎవరైనా అధికారులు చర్యలు తీసుకుంటే బావుంటుందని అన్నారు.కరీంనగర్ బస్టాండ్ లో జరుగుతున్న నిలువు దోపిడి, నాసిరకమైన వస్తువులు, పదార్థాల అమ్మకాలపై ఏబీపీ దేశం వివరణ కోరగా.. ఇక్కడ జరిగే అలాంటి వాటిపై తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గతంలో కూడా నాణ్యత లేని పదార్థాలు విక్రయించడం, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరపడంపై తమకు కంప్లైంట్ వస్తే చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎవరైనా ప్రయాణికులు తమకు రాత పూర్వకంగా కంప్లైంట్ ఇస్తేనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాణ్యత విషయానికొస్తే.. ఆహార భద్రత శాఖ వారు ఈ విషయంపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కరీంనగర్ బస్టాండ్లో జరుగుతున్న నిలుదోపిడి, నాసిరకమైన వ్యాపారాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియాలంటే వేచి చూడక తప్పదు.

## తమిళనాడులోనే..

గణాంకాలను పరిశీలిస్తే ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, గుజరాత్, బీహార్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, హర్యానా వంటి చాలా రాష్ట్రాలు నరేంద్ర మోదీని ప్రధానిగా కోరుకుంటున్నాయి. అదే సమయంలో రాహుల్ గాంధీ ప్రధాని కావాలని తమిళనాడు ప్రజలు కోరుకుంటున్నారు. ఆయనను 44.1 శాతం మంది ప్రజలు ఎన్నుకున్నారు. 43.2 శాతం మంది ప్రజలు నరేంద్ర మోదీతో ఏకీభవిస్తున్నారుదేశంలో మళ్లీ నరేంద్ర మోదీ ప్రభుత్వమే ఏర్పడుతుందని సర్వేలో 64 శాతం మంది విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సర్వే ప్రకారం దేశ తదుపరి ప్రధానమంత్రి పదవికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. 64 శాతం మంది ప్రజలు ప్రధాని పదవికి ప్రధాని మోదీని ఇష్టపడగా, 21.8 శాతం మంది కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీకి ప్రాధాన్యత ఇచ్చారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్కు 4.3 శాతం, పశ్చిమ బెంగాల్కు చెందిన మమతా బెనర్జీకి 1.3 శాతం, ఇతరులకు 8 శాతం ఓట్లు వచ్చాయి.64 శాతం మంది ప్రజలు దేశంలో మరోసారి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడుతుందని నమ్మకంగా ఉన్నారని, బీజేపీ గెలుస్తుందని చెప్పారు . ఈసారి కూడా దేశంలోని చాలా ప్రాంతాల్లో బీజేపీ వ్యతిరేకతను తుడిచిపెట్టేస్తుంది. కర్ణాటకలో 72 శాతం మంది ప్రజలు 2024లో ఎన్డీయే గెలుస్తుందని సర్వేలో తేలింది. కేవలం 20 శాతం మంది మాత్రమే భారత కూటమిని విజయపథంలో నడిపించారు. అలాగే మహారాష్ట్రలో 58 శాతం మంది బీజేపీకి అనుకూలంగా, 33 శాతం మంది భారత కూటమికి అనుకూలంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.తమిళనాడులో ఈ సంఖ్య 5050గా ఉంది. రెండు కూటములకు 45 శాతం ఓట్లు వస్తాయి. తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్లలో 65 శాతానికి పైగా ఎన్డీఏకు అనుకూలంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, 25 శాతానికి పైగా భారత కూటమికి అనుకూలంగా ఉన్నారు. ఒడిశాలో బీజేపీ గెలుస్తుందని అన్నారు.సర్వేలో, ఒడిశాలో అత్యధికంగా 74 శాతం మంది ఎన్డీఏ కూటమికి అనుకూలంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో భారత కూటమి విజయం సాధిస్తుందని రాష్ట్రంలో కేవలం 10 శాతం మంది మాత్రమే విశ్వసిస్తున్నారు. ఈ సర్వేలో బీజేపీకి ఢిల్లీ ప్రజల స్పందన అంతగా లేదు. ఢిల్లీలో మొత్తం 7 సీట్లు గెలుస్తామని చెబుతున్న బీజేపీకి 68 శాతం మంది మాత్రమే సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, 23 శాతం మంది బీజేపీకి వ్యతిరేకంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.యూత్ ఫస్ట్ చాయిస్ పీఎం మోదీ సర్వే ప్రకారం 45 ఏళ్లు పైబడిన వారిలో 73 శాతం మంది నరేంద్ర మోదీ మళ్లీ ప్రధాని కుర్చీలో కూర్చోవాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో 18 ఏళ్ల లోపు వారిలో 70 శాతం మంది మోదీ ప్రధాని కావాలని కోరుకుంటున్నారు. మనం ఉద్యోగుల గురించి మాట్లాడితే, 71 శాతం మంది నరేంద్ర మోదీని కోరుకుంటున్నారు. అయితే 72 శాతం మంది రిటైర్డ్ వ్యక్తులు మోదీని మళ్లీ ప్రధాని కావాలని కోరుకుంటున్నారు.ఆర్థికాభివృద్ధిలో మోదీ ప్రభుత్వం ఎంత ప్రభావవంతంగా ఉంది? అన్న విషయంలో.. మోదీ ప్రభుత్వ హయాంలో దేశ ఆర్థిక ప్రగతి మెరుగ్గా ఉందని డెయిలీహంట్ సర్వేలో 60 శాతం మంది అంగీకరించారు. మోదీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను చక్కగా నిర్వహించిందని 53 శాతం మంది అభిప్రాయపడ్డారు. అయితే, 21 శాతం మంది తాము మరింత మెరుగ్గా చేయగలిగామని చెప్పారు. ఇందులో కొత్తేమీ లేదని కొందరు అంటున్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశ ఆర్థిక ప్రగతిపై 60 శాతం మంది ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. అదే సమయంలో 22 శాతం మంది ప్రజలు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు.డైలీహంట్ ప్రాంతాల వారీగా సర్వే కూడా నిర్వహించింది. ఇందులో మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల దేశంలోని ఏ ప్రాంతం ప్రభావితమైందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. ప్రతిస్పందనగా, 64 శాతం ఉత్తర భారతీయులు సంతోషంగా ఉన్నారు. తూర్పు, పశ్చిమ భారతదేశంలో కూడా దాదాపు 63 శాతం మంది సంతోషం వ్యక్తం చేశారు. అయితే, దక్షిణ భారతీయులు తక్కువ సంతృప్తితో ఉన్నారు కేవలం 55 శాతం మంది మాత్రమే అనుకూలత వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రధాని మోదీ ఆర్థిక విధానాలపై 64 శాతం మంది విద్యార్థులు సంతృప్తిగా ఉన్నారు. రిటైరైన వారిలో 63 శాతం, ఉద్యోగులు 61 శాతం, వ్యాపారులు 55 శాతం, గృహిణుల్లో 54 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. డైలీహంట్ నిర్వహించిన వయసుల వారీగా నిర్వహించిన సర్వేలో 18 ఏళ్లలోపు వారిలో 67 శాతం మంది మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు బాగున్నాయని చెప్పారు. అదేవిధంగా 45 ఏళ్లు పైబడిన వారిలో 65 శాతం మంది కూడా సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారిలో 57 శాతం మంది మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు బాగున్నాయని వివరించారు.విదేశాంగ విధాన విషయాల్లో మోదీ ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది? గత కొన్ని సంవత్సరాలుగా గ్లోబల్ సవాళ్లు పెరిగాయి. కరోనా మహమ్మారి కాకుండా, రష్యాఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్హమాస్ యుద్ధంతో సహా అనేక ప్రధాన ప్రపంచ సవాళ్లు ఉద్భవించాయి. వీటన్నింటి నడుమ నరేంద్ర మోదీ ప్రభుత్వ గ్లోబల్ పాలసీపై జరిపిన సర్వే ద్వారా విదేశాంగ విధానంలో ప్రభుత్వం ఎంతవరకు విజయం సాధించిందో తెలుసుకునే ప్రయత్నం జరిగింది. మోదీ ప్రభుత్వం చాలా బాగుందని 64 శాతం మంది అభివర్ణించగా, 14.5 శాతం మంది విదేశాంగ విధానం బాగుండేదని అభిప్రాయపడ్డారు. దాదాపు 11 శాతం మంది ఈ అంశంపై తటస్థంగా ఉన్నారు.వృత్తి ప్రాతిపదికన మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానంతో ఏ తరగతికి కోపం ఎక్కువ, ఏ తరగతి సంతోషంగా ఉంది ? అన్న విషయానికి వస్తే, 60 శాతానికి పైగా ఉద్యోగుల, వ్యాపారులు, విద్యార్థులు, పదవీ విరమణ పొందిన వర్గాలు మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం పట్ల సంతృప్తి చెందారు. అయినప్పటికీ గృహిణులు ఈ విషయంలో కొంచెం అసంతృప్తి చెందారు. ఈ వర్గంలో దాదాపు 58 శాతం మంది మాత్రమే ప్రభుత్వ విదేశాంగ విధానం మంచిదని భావిస్తున్నారు.సర్వే ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారో తెలుసుకునే ప్రయత్నం కూడా చేశారు. సర్వేలో దాదాపు 54 శాతం మంది ప్రజలు మోదీ ప్రభుత్వం పట్ల చాలా సంతోషంగా ఉండగా, దాదాపు 25 శాతం మంది ప్రభుత్వం పట్ల సంతోషంగా లేరు. ఈ అంశంపై 15 మందికి పైగా తటస్థంగా ఉన్నారు.

## నాన్ వెజ్ లవర్స్ కు షాక్..

జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలతో ఆదివారం మాంసం దుకాణాలు మూతపడనున్నాయి. జైనులకు మహావీర్ జయంతి చాలా ముఖ్యమైన పండుగ.జైనులు జరుపుకునే పండుగలలో మహావీర్ జయంతి చాలా ముఖ్యమైనది. అహింసను ప్రబోధించిన జైన మత ప్రచారకుడు, వర్ధమాన మహావీరుడి జయంతిని ప్రతిసంవత్సరము చైత్ర మాసంలో ఘనంగా జరుపుకుంటారు. 36వ ఏట సన్యాసాన్ని స్వీకరించిన వర్ధమానుడు.. 12 ఏళ్ళ పాటు తపస్సు చేసి మహావీరుడుగా జైనమత ప్రచారకుడయ్యారు. అప్పటికే జైన మతానికి 23 మంది తీర్ధంకరులుగా ఉన్నప్పటికీ మహావీరుడు బాధ్యతలు చేపట్టిన తర్వాతే ఆ మతానికి సంబంధించిన వివరాలు వెలుగు చూసినట్లుగా చెబుతారు. 32 ఏళ్ళ పాటు అహింసా ధర్మంతో మత ప్రచారం జరిపిన మహావీరుడు 72వ ఏట మరణించారు.జన్మదినం సందర్భంగా హైదరాబాద్లోని కబేళాలతో పాటు మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశించినట్లు జీహెచ్ఎంసీ రొనాల్డ్ రాస్ తెలిపారు. హైదరాబాద్ సిటీలో మాంసానికి ఉన్న డిమాండ్ మరే నగరంలోనూ ఉండని సంగతి తెలిసిందే. పెద్ద సంఖ్యలో ఉన్న జనాభాతో పాటు వేలాది సంఖ్యలో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు కూడా భారీ మొత్తం మాంసం కొనుగోలు చేస్తుంటాయి. ఆదివారం షాపుల మూసివేత కారణంగా వీరికి కాస్త నష్టం ఎక్కువగా ఉండనుంది. కానీ, ఈ ఉత్తర్వుల గురించి తెలిసిన వారు మాత్రం ముందు రోజే తాజా మాంసాన్ని కొనుగోలు చేసుకొని ఫ్రిడ్జ్ లో నిల్వ చేసుకొని ఆదివారాన్ని యథాతథంగా జరుపుకోనున్నారు. తిరిగి సోమవారం యథావిధిగా కబేళాలు తెరుచుకోవచ్చని కమిషనర్ చెప్పారు.హైదరాబాద్ లోనూ జైనుల సంఖ్య గణనీయంగా ఉండడంతో...మహావీర్ జయంతి నాడు నగరంలో మాంసం విక్రయాలపై ఆంక్షలు విధించింది జీహెచ్ఎంసీ. ఈ నిర్ణయానికి ప్రజలు సహకరించాలని కోరింది. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మాంసం షాపులు ఓపెన్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని జీహెచ్ఎంసీ కమిషనర్ హెచ్చరించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ఈ ఉత్తర్వులను అమలు చేయడంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం యథావిధిగా కబేళాలు తెరుచుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# మిల్క్ షేక్ రూపంలో గంజాయి

✍ జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 18:

గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా.. రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట వీటి ఆనవాళ్లు బయటపడుతూనే ఉన్నాయి. స్మగ్లర్లు కొత్త దారుల్లో వీటిని సరఫరా చేస్తున్నారు. ఇటీవల కొన్ని చోట్ల చాక్లెట్ల రూపంలో గంజాయిని గుర్తించగా.. ఇప్పుడు పౌడర్ రూపంలో దొరకడం కలకలం రేపుతోంది. అంతే కాకుండా గంజాయితో చేసిన మిల్క్ షేక్ ల రూపంలో మార్కెట్లో అమ్మడం ఆందోళన కలిగిస్తోంది. అంతే కాకుండా గంజాయి పొడిని పాలల్లో సైతం కలుపుకొని తాగుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కిరాణా దుకాణంలో గంజాయి పొడిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని పాలల్లో కలుపుకొని మిల్క్ షేక్స్ రూపంలో తాగుతున్నారని సదరు షాప్ ఓనర్ చెప్పడంతో పోలీసులు షాక్ అయ్యారు. ఇలా తాగడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలని యువతను తప్పుదోవ పట్టించగా.. దుకాణం యజమాని మాటలు విని మిల్క్ షేక్ తాగిన వారు ఏకంగా 7 గంటలు మత్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం.. దుకాణంపై దాడి చేసి యజమానిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 4 కేజీల గంజాయి, అలాగే 160 ప్యాకెట్ల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిని సరఫరా చేసిన ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు దీనిపై మరింత విచారణ చేస్తున్నారు.

# డిప్యూటీ తహశీల్దార్ చెంప చెళ్లుమనిపించిన మహిళ

✍ జయభేరి, మహబూబ్ నగర్, ఏప్రిల్ 18:

తనతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ అధికారి చెంప ఛెళ్లుమనిపించింది ఓ మహిళ. ఫోన్ లో ఫోటోలు తీస్తుండగా గుర్తించిన మహిళ తగిన బుద్ధి చెప్పింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నారాయణఖేడ్ పట్టణంలోని ఓ ఇంట్లో డిప్యూటీ తహసీల్దార్ నివాసం ఉంటున్నారు. అయితే, పక్క పోర్షన్ లో ఉన్న ఓ మహిళ.. డిప్యూటీ తహసీల్దార్ తనతో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపిస్తూ అతని చెంప పగలగొట్టింది. ఫోన్ లో వీడియోలు, ఫోటోలు తీసి వేధింపులకు గురి చేస్తున్నట్లు వాపోయింది. అనంతరం తన భర్తకు సమాచారం ఇచ్చింది. బాధితురాలి భర్త డిప్యూటీ తహసీల్దార్ పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించిన సీసీ పుటేజీని అందజేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు


# ఈటెల రాజేందర్ సేవలు దేశానికి చాలా అవసరం

- కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరి
- ఈటెల ను ఈ సారి భారీ మెజారిటీతో గెలిపించాలి - హరిదీప్ సింగ్ పూరి
- సీఎం రేవంత్ రెడ్డి మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారు ఈటెల రాజేందర్

**జయభేరి, ఏప్రిల్ 18 :**

దేశాభివృద్ధి ప్రధాని మోడీ గారితోనే సాధ్యమని , పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్ గిరి అభ్యర్థి ఈటెల రాజేందర్ ను సంపూర్ణ మెజార్టీతో గెలిపించాలని కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరి కోరారు. ఈటెల రాజేందర్ సేవలు తెలంగాణ రాష్ట్రానికే కాదు దేశానికి కూడ అవసరం అని ఆయన పేర్కొన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయంలో మల్కాజ్ గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గా ఈటెల రాజేందర్ నామినేషన్ దాఖలు చేయగా, ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు హరిదీప్ సింగ్ పూరి, కిషన్ రెడ్డి తో పాటు పలువురు పార్టీ నేతలు హాజరయ్యారు. అంతకుముందు ఈటెల నివాసం నుండి మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయం వరకు బీజేపీ నేతలతో కలిసి ఈటెల భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రులు, ఈటెల రాజేందర్ సమక్షంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, ఆయన సతీమణి స్వప్న తో పాటు బార్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ సునీల్ గౌడ్ సమక్షంలో బీజేపీ గూటికి చేరారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరి మాట్లాడుతూ మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థి గా ఈటెల రాజేందర్ నామినేషన్ వేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాజకీయ రంగంలో అనుభవం కలిగి, 7 ఏళ్ళు మంత్రిగా ఈటెల పనిచేశారని గుర్తు చేశారు. కరోన ఆపద సమయంలో కూడా ఈటెల చేసిన సేవలను కొనియాడారు. ఈ సారి జరిగే ఎన్నికల్లో ఈటెల ను గెలిపించి పార్లమెంట్ కు పంపుతారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. ఆయన సేవలు తెలంగాణ రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా ఎంతో అవసరం అని తెలిపారు. మోడీ నాయకత్వం లో ఆయన పనిచేయాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఈటెల గెలుపు అనంతరం తాను మళ్ళీ వస్తానని స్పష్టం చేశారు. అనంతరం ఈటెల రాజేందర్ మాట్లాడుతూ యావత్ దేశం మొత్తం మళ్ళీ ప్రధాని మోడీ కావాలని కోరుకుంటున్నారని. మోడీ తోనే సంపూర్ణ భవిష్యత్ ఉందని స్పష్టం చేశారు. ట్రిపుల్ తలాక్ రద్దు చేయడంతో ముస్లిం మహిళలు సైతం మోడీ వైపు ఉన్నారన్నారు. దొంగ సర్వేలతో పెయిడ్ ఆర్టికల్స్ తో ప్రజల మనస్సును మార్చలేరన్నారు. డబ్బు సంచులతో రేవంత్ సర్కార్ ప్రజలను ప్రలోభ పెట్టేందుకు ముందుకు వస్తుందని, ఆ ప్రలోభాలకు తలొగ్గిదని మల్కాజ్ గిరి ప్రజలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనకు, రేవంత్ రెడ్డి పాలనకు ఏ మాత్రం తేడా లేకుండా పోయిందని అన్నారు. మల్కాజ్ గిరి పట్ల తనకొక విజన్ ఉందని, ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రజల బాధలను గుర్తించానని, ఈ సారి తనను గెలిపిస్తే సంపూర్ణ అభివృద్ధి చేసి చూపిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ అభ్యర్థి వంశీ తిలక్, మల్కాజ్ గిరి బీజేపీ పార్లమెంట్ ఇంచార్జ్ , ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావ్, మాజీ ఎమ్మెల్యేలు బొడిగే శోభ, ఎన్వీ ఎస్ ఎస్ ప్రభాకర్, సామ రంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి, బీజేపీ మహిళా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి, ఎస్సి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాష, నియోజకవర్గ కన్వీనర్ ఆర్కే శ్రీనివాస్, మల్లారెడ్డి, మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, రాజయ్య యాదవ్, బీజేపీ సీనియర్ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి, మల్క కొమురయ్య, సుధాకర్ గాండే, వీకే మహేష్, నార్రెడ్డి నందారెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, గిరివర్ధన్ రెడ్డి, కార్పోరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.







# ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రయుధం లాంటిది

**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ త్రిళేశ్వర్ రావు ఆధ్వర్యంలో 'సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ ప్రోగ్రాం' (SVEEP2024 ) పై RP స్వయం సహాయక సంఘాలు, మున్సిపల్ అధికారులకు, మెప్మా అవగాహన కార్యక్రమాన్ని 2BHK పర్వతపురం కాలనీ యందు, మునిసిపల్ కార్యాలయం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రయుధం లాంటిదని, ఓటు కలిగివున్న వారే ప్రజాస్వామ్యంలో రాజులు, రాణులు అన్నారు. ఓటును తప్పకుండా కలిగి ఉండాలని, అందుకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోని ఎన్నికల లో భాగస్వాములయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా అనిల్, వార్డ్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొని.. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని కలవడం జరిగింది. ఈ సందర్భంగా మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డి గెలుపుకై చేపట్టవలసిన కార్యాచరణపై చర్చించి దిశా నిర్దేశం చేయడం జరిగింది.

**జయభేరి, మేడిపల్లి**



# అక్రమ బ్లాస్టింగ్ లపై ఎస్ఓటి పోలీసుల దాడులు

- ఒకరు అరెస్ట్.. పరారీలో ఇద్దరు
- బ్లాస్టింగ్ లకు ఉపయోగించే సామాగ్రి స్వాధీనం
- శామీర్ పేట్ మండలం తుంకుంట లో ఘటన

**జయభేరి, ఏప్రిల్ 18 :**

ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్న ఓ వ్యక్తిని ఎస్ వోటి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ పోలీసులు పరిధిలో చోటుచేసుకుంది. మేడ్చల్ కు చెందిన విజయ్, రోజా, కుమార్ లు ముగ్గురు శామీర్ పేట్ మండలం తుంకుంట లోని ఓపెన్ సైట్ లో ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ లు జరుపుతున్నారు. దింతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే ఈ అక్రమ బ్లాస్టింగ్ లపై సమాచారం అందుకున్న ఎస్ వో టి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విజయ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారయ్యారు. వీరి వద్ద నుండి 3 జిలేటిన్ స్టిక్స్, స్విచ్ బాక్స్, 2 వైర్ బండల్స్, కంప్రెషర్ ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




# ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

**జయభేరి, ఏప్రిల్ 18 :**

ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శామీర్ పేట్ మండలం బాబాగూడ గ్రామానికి చెందిన కాసుల సంపత్ (23) ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్టవేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. గత మూడు నెలల క్రింది నుంచి కంపెనీ యాజమాన్యం హోల్డ్లో పెట్టడంతో ఆర్థిక పరిస్థితి బాగాలేక ఆర్థిక ఎదుర్కొం టున్నాడు. దీంతో మనస్తాపానికి గురై శామీర్ పేట్ నుంచి బొమ్మరాసి పేట్ గ్రామానికి వెళ్లే మార్గమద్యలో ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్యహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అం దించారు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామ నిర్వహించి పోసుమార్గం నిమిత్తం. గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# స్వచ్ఛందంగా రక్తదానం చేసిన న్యాయవాదులు

- జవహర్ నగర్ లో తలసేమియా వ్యాధి గ్రస్తుల చిన్నారుల కోసం రక్త దాన శిబిరం ఏర్పాటు

**జయభేరి, ఏప్రిల్ 18:**

మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ లోని కమ్యూనిటీ హాలులో న్యాయవాది రమ్యశ్రీ ఆధ్వర్యంలో మరియు కో ఆపరేటివ్ సభ్యుల సౌజన్యంతో తలసేమియా వ్యాధి గ్రస్తుల పిల్లల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి అటు ప్రజల నుండి ఇటు న్యాయవాదుల నుండి విశేష స్పందన లభించింది. అనంతరం పలువురు న్యాయవాదులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అంతేకాక మహిళా న్యాయవాదులు సైతం రక్తదానం చేసి అందరి ప్రశంసలు పొందారు. తలసేమియా వ్యాధి చిన్నారులకు మేలు చేకూర్చలనే ఉద్దేశ్యం తో ఈ రక్తదాన శిబిరం నిర్వహించడం ఎంతో సంతోషకరమని అన్నారు, ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కో సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ, అడ్వకేట్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, ట్రెజరర్ జనార్ధన్ రావు, మల్కాజ్గిరి డిస్ట్రిక్ట్ కోర్ట్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్, ఇంటర్నేషనల్ ఉమెన్ రైట్స్ జనరల్ సెక్రెటరీ నరసింహా గౌడ్, ఉస్మాన్ మహమ్మద్ ఖాన్, తల సేమియా స్కిల్ సెల్ సొసైటీ జాయింట్ సెక్రెటరీ అలిమెబిగ్, సీనియర్ అడ్వకేట్ శ్రీనివాస్, శంకర్ ప్రసాద్ శ్రీకాంత్ సంజయ్, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.






# మల్కాజ్ గిరి పార్లమెంట్ స్థానానికి మొదలైన నామినేషన్ల పర్వం

- ఇప్పటి వరకు 9 నామినేషన్ల స్వీకరణ - జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

**జయభేరి, ఏప్రిల్ 18 :**

మేడ్చల్ మల్కాజిగిరి, 7 పార్లమెంట్ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ లో భాగంగా గురువారం జిల్లాలో (8 )మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పార్లమెంట్ స్థానానికి 1. భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ నామినేషన్, 2. భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ఈటల జమున నామినేషన్, 3. ఇండిపెండెంట్ అభ్యర్థిగా పాలది పవన్ కుమార్ నామినేషన్ 4. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బేగరి లోకేష్ నామినేషన్ 5. అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా మేడే సత్యం 6. ఇండిపెంట్ అభ్యర్థిగా చిలకా చంద్రశేఖర్ నామినేషన్, 7. ఇండిపెండెంట్ అభ్యర్థిగా మలోటు శంకర్ నామినేషన్, 8. ఇండిపెండెంట్ అభ్యర్థిగా పెసరికాయల పరీక్షిత్తు రెడ్డి రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా, వెరసి మొత్తం 9 నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది.



# కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి

- కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్



**జయభేరి, మేడ్చల్ :**

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిదిలోని సూతరిగుడా లో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి కి మద్దతుగా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇంటి ఇంటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తుందని సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటి పథకాలను అమలు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన సాగుతోందన్నారు. మల్కాజిగిరి ప్రాంతం అభివృద్ధి కోసం ప్రజలు ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, చిల్ల వెంకటేష్, చింతల భాస్కర్, నత్తి మహేష్, చిల్ల నరేష్, సాకర బోయిన వెంకటేష్ ముదిరాజ్, చిల్ల సాయికుమార్, సాకర బోయిన సాయికుమార్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# శామీర్ పేట్ లో విఎస్ఆర్ వాటర్ ప్లాంట్ ఆధ్వర్యంలో చలి వేంద్రం

- వేసవిలో చాలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయి - విఎస్ ఆర్ సభ్యులు




**జయభేరి, ఏప్రిల్ 18:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ దర్గా వద్ద విఎస్ఆర్ వాటర్ ప్లాంట్ ఆధ్వర్యంలో చాలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత 11 సంవత్సరాలుగా విఎస్ఆర్ కుటుంబ సభ్యులు అంతా కలసి వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం చాలి వేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వంగ సంజీవ రెడ్డి, పెద్ద శ్రీను, సుభాష్ రెడ్డి, జావిద్, వంగ సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# తీన్మార్ మల్లన్న ను కలసిన తిగుల్ గ్రామ కాంగ్రెస్ నేతలు

- గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని నేతలకు హితవు : ఉప్పల ప్రవీణ్

**జయభేరి, ఏప్రిల్ 18 :**

తెలంగాణ రాష్ట్ర పీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ తీన్మార్ మల్లన్న ను సిద్దిపేట జిల్లా తిగుల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పార్టీ స్థితి గతులపై చర్చించారు. గ్రామ, మండల స్థాయి నుండి పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ కష్టపడి పనిచేయాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల ప్రవీణ్, నితీష్ రెడ్డి, మహేందర్ రెడ్డి, ప్రవీణ్, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- సాయిపేట శ్రీనివాస్



**జయభేరి, మేడ్చల్ :**

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిదిలోని 6వ వార్డు మైసమ్మగూడలో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి కి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి కి మద్దతుగా హస్తం గుర్తుకు ఓటు వేయాల్సిందిగా ప్రజలను అభ్యర్ధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం వైపు ఉంటే బీఆర్ఎస్ పార్టీ అవినీతి వైపు ఉందని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందన్నారు. ప్రజల సంక్షేమం కోరే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలు పక్కాగా అమలు చేస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణా రెడ్డి, మద్దుల మాధవ్ రెడ్డి, సుంకరి శ్రీనివాస్, కృష్ణా, రమేష్, సత్యనారాయణ, శంకర్, చింత రమేష్, మల్లేష్, ఐలేష్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం కూలీలకు కనీస వేతనం ఇవ్వాలి

- ఉపాధి కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు



**జయభేరి, బయ్యారం, ఏప్రిల్ 18:**

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకం నత్త నడక నడుస్తూ ఉపాధి కూలీలకు కనీస వేతనం కూడా వచ్చే పరిస్థితి లేదు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలైన మంచినీరు. నీడ. వైద్య కిట్టు. గడ్డపార. తట్ట.పారలు కూడా సప్లై చేయడం లేదని. రోజు వేతనం కూడా 50 రూపాయల నుండి.100 రూపాయలకు మించడం లేదని. వేతనాలు వార. వారం ఇవ్వకుండా ఆరు వారాలు గడిచిన ఇచ్చే పరిస్థితి లేదని వేతనాలు సకాలంలో చెల్లించకపోవడం వలన అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఉపాధి హామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయ్యారం మండలంలోని బాలాజీ పేట. వెంకట్రాంపురం పని ప్రదేశాల్లో పరిశీలనకు వెళ్లిన సందర్భంగా ఉపాధి కూలీలు తమ గోడును వెల్లబుచ్చారని అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి తోకల వెంకన్నలు అన్నారు. ఈ సందర్భంగా నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి కూలీలు తమ జీవన భృతి కోసంమండుటెండల్లో పనిచేస్తున్న వారికి కనీస వేతనాల చట్టం ప్రకారం రోజు కూలి ఇవ్వడంలేదని పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడంలో. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. అధికారం కోసమే అరాటపడుతూ అనేక వాగ్దానాలు చేస్తున్న పాలకులు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా. కనీస వేతన చట్టాన్ని కూడా అమలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ. ఉపాధి కూలీలకు కనీస వేతన చట్టం ప్రకారం కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలి 750 రూపాయలు ఇవ్వాలని. పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని. జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సంవత్సరానికి ₹200 రోజులు పని కల్పించాలని. పథకంలో పనిచేస్తున్న ఎన్.ఎం.ఎం.ఎస్ ల నుండి పిఓల వరకు అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పిఎఫ్. ఈఎస్ఐ. పిఆర్సి ని అమలు చేయాలని. పెండింగులో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని. రద్దు చేసిన అలవెన్స్లను పునరుద్ధరించాలని. వారానికి ఒకసారి మస్టర్ల స్లిప్పులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర మురళి. కొత్త రామదాస్. దీకొండ వెంకటరమణ. పోతుల నిరోషా. ఉప్పరపల్లి మల్లేశం కొమ్మినేని వెంకన్న. బొల్లం సోమక్క. కమటం వినోద. రావుల వెంకన్న. అత్తునూరి లక్ష్మి. పోలేబోయిన అనసూర్య. రావుల వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఐపీఎల్‌లో మరోపోరు అభిమానులను ఊపేసింది. ఆధిక్యం చేతులు మారుతూ సాగిన అద్భుత పోరులో పంజాబ్ పోరాడినా..ముంబైదే పైచేయి అయ్యింది. ముంబై నిర్దేశించిన 193 పరుగుల లక్ష్యఛేదనలో బుమ్రా ధాటికి 49 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన పంజాబ్.. అశుతోష్‌శర్మ, శశాంక్‌సింగ్ పోరాటపటిమతో పుంజుకుంది. అసలు గెలుపు ఆశలు లేని స్థితి నుంచి ముంబైకి ముచ్చెమటలు పట్టిస్తూ ముల్లాన్‌పూర్‌లో అశుతోష్ సిక్సర్లతో చెడుగుడు ఆడుకున్నాడు. బుమ్రా విజృంభణకు కొయెట్జీ జత కలువడంతో ముంబై ఆఖరి ఓవర్లో విజయాన్నందుకుంది. సూర్యకుమార్‌కు తోడు రోహిత్‌శర్మ, తిలక్‌వర్మ ముంబై పోరాడే స్కోరు అందుకుంది.

# పంజాబ్ పోరాడినా.. ముంబైదే పైచేయి

## సూర్య హాఫ్ సెంచరీ.. రాణించిన బుమ్రా, కొయెట్జీ

ముల్లాన్‌పూర్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 9 పరుగుల తేడాతో నెగ్గింది. ఆల్‌రౌండ్ షో తో ఆకట్టుకున్న ఆ జట్టు బ్యాటింగ్‌లో సూర్యకుమార్ యాదవ్ (53 బంతుల్లో 78, 7 ఫోర్లు, 3 సిక్సర్లు), రోహిత్ శర్మ (36) మెరుపులు మెరిపించడంతో 7 వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. భారీ ఛేదనలో పంజాబ్ 111 పరుగులకే 7 వికెట్లు కోల్పోయినా అశుతోష్ శర్మ (28 బంతుల్లో 61, 2 ఫోర్లు, 7 సిక్సర్లు) అద్వితీయ పోరాటానికి శశాంక్ సింగ్ (41) మెరుపులతో ఆ జట్టు విజయానికి చేరువగా వచ్చినా 19.1 ఓవర్లలో 183 పరుగుల వద్దే ఆగిపోయింది. ముంబై బౌలర్లు బుమ్రా (3/21),కొయెట్జి (3/32) పంజాబ్ పతనాన్ని శాసించారు. బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

ముంబైకి రబాడా మూడో ఓవర్లోనే కిషన్ (8)ను ఔట్ చేసి తొలి షాకిచ్చినా సుదీర్ఘ ఐపీఎల్ కెరీర్‌లో 250వ మ్యాచ్ ఆడుతున్న రోహిత్‌తో కలిసి సూర్య మెరుపులు మెరిపించాడు. క్రీజులోకి రావడంతోనే బౌండరీల వేట మొదలుపెట్టిన సూర్య.. స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు.

హిట్‌మ్యాన్ కూడా వీలుచిక్కినప్పుడల్లా బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. అర్‌షదీప్ వేసిన నాలుగో ఓవర్లో డీప్ మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్సర్ బాదాడు. కరన్ వేసిన 12వ ఓవర్లో బ్యాక్‌వర్డ్ పాయింట్ వద్ద హర్‌ప్రీత్‌తక్కువ ఎత్తులో వచ్చిన క్యాచ్‌ను అందుకోవడంతో రోహిత్ ఔటయ్యాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు 57 బంతుల్లోనే 81 పరుగులు జోడించింది. రోహిత్ స్థానంలో వచ్చిన తిలక్ వర్మ (34 నాటౌట్)తో కలిసి సూర్య బాదుడు కొనసాగించాడు. రబాడా ఓవర్లో ఓ ఫోర్, రెండు సిక్సర్లతో 18 రన్స్ పిండుకున్నారు. 28 బంతుల్లోనే 49 పరుగులు జతచేసిన ఈ జోడీని 17వ ఓవర్లో కరన్ విడదీశా డు. హార్దిక్ పాండ్యా (10) మరోసారి విఫలమయ్యాడు.

భారీ ఛేదనలో పంజాబ్.. తొలి ఓవర్ వేసిన గెరాల్డ్ కొయెట్జీ.. ప్రభ్‌సిమ్రన్‌ను ఔట్ చేసి వికెట్ల పతనానికి శ్రీకారం చుట్టాడు. రెండో ఓవర్ వేసిన బుమ్రా.. రెండు కీలక వికెట్లు తీసి ఆ జట్టు కోలుకోనీయకుండా చేశాడు. నాలుగో బంతికి రూసో (1)ను యార్కర్‌తో క్లీన్‌బౌల్డ్ చేసిన అతడు.. ఆఖరి బంతికి కరన్‌ను పెవిలియన్‌కు పంపాడు. ప్రమాదకర లివింగ్‌స్టోన్ (1) కొయెట్జీ మూడో ఓవర్లో అతడికే క్యాచ్ ఇచ్చాడు. దీంతో ఆ జట్టు 2.1 ఓవర్లలో 14 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. హర్‌ప్రీత్ (13)ను స్పిన్నర్ శ్రేయస్ ఏడో ఓవర్లో పెవిలియన్‌కు పంపాడు. ఆకాశ్ మధ్వాల్ 16వ ఓవర్లో అశుతోష్ మూడు సిక్సర్లతో రెచ్చిపోగా బ్రర్ సైతం ఓ సిక్సర్ బాదాడు. ఈ ఓవర్లో మొత్తం 24 పరుగులొచ్చాయి. కానీ బుమ్రా వేసిన 17వ ఓవర్లో మూడు పరుగులే రాగా కొయెట్జీ 18వ ఓవర్లో తొలి బంతికే డీప్ మిడ్ వికెట్ వద్ద నబీకి అశుతోష్ క్యాచ్ ఇచ్చాడు. 12 బంతుల్లో ఆ జట్టు విజయానికి 23 పరుగులు అవసరం కాగా హార్దిక్ వేసిన 19వ ఓవర్లో బ్రర్ వికెట్ కోల్పోయినా పంజాబ్ 11 పరుగులు రాబట్టడంతో ఆఖరి ఓవర్లో ఉత్కంఠకు దారితీసింది. రెండో పరుగు తీయబోయి రబాడా రనౌట్ అవడంతో ఆ జట్టు ఓటమివైపు నిలిచింది.

గత మూడు మ్యాచ్‌లలో పంజాబ్ బ్యాటింగ్‌కు వెన్నెముకగా మారిన అశుతోష్ శర్మ, శశాంక్ సింగ్ మరోసారి పంజాబ్‌ను ఆదుకున్నారు. శశాంక్.. శ్రేయస్ 9వ ఓవర్లో రెండు భారీ సిక్సర్లతో రెచ్చిపోయాడు. అశుతోష్ ఎదుర్కొన్న రెండో బంతినే సిక్సర్‌గా మలిచాడు.

షెపర్డ్ 10వ ఓవర్లో 4,6 చెలరేగాడు. ఈ ఇద్దరి దూకుడుతో లక్ష్యం దిశగా సాగుతున్న పంజాబ్‌ను బుమ్రా మరోసారి దెబ్బకొట్టాడు. 13వ ఓవర్లో రెండోసారి బౌలింగ్‌కు వచ్చిన బుమ్రా.. శశాంక్‌ను ఔట్ చేయడంతో 34 పరుగుల ఏడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కానీ శశాంక్ ఔట్ అయినా అశుతోష్ మాత్రం పోరాటాన్ని ఆపలేదు. తనదైన షాట్లతో అభిమానులను హోరెత్తించాడు. ఈ క్రమంలో అతడు 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. హర్‌ప్రీత్ బ్రర్ (21) అతడికి అండగా నిలిచాడు.

**సంక్షిప్త స్కోర్లు**

ముంబై : 20 ఓవర్లలో 192/7 (సూర్య 78, రోహిత్ 36, హర్షల్ 3/31, కరన్ 2/41).

పంజాబ్ : 19.1 ఓవర్లలో 183 (అశుతోష్ 61, శశాంక్ 41, బుమ్రా 3/21, కొయెట్జీ 3/32)

# మీ భాగస్వామితో మీరు ఆనందంగా ఉండాలంటే..



- ఆరోగ్యకరమైన అనుబంధాన్ని ఏర్పరచుకోవడం ఒక్కటే దారి

అన్ని విహారయాత్రలు చేసినా, బయట ఎంత తిరిగినా... చివరికి ఇంటికి వెళ్ళాకే మనసుకు సేద తీరినట్టు అనిపిస్తుంది. ఇల్లు ఆనందవనంలా ఉండాలంటే మీరు జీవిత భాగస్వామితో అనుబంధాన్ని ఏర్పరచుకోవాలి.

జీవిత భాగస్వామితో మీకు మంచి బంధం ఉంటే మీ ఇల్లు అందమైన తోటలా కనిపిస్తుంది. అదే మీకు, మీ పార్టనర్‌కు సరిపడకపోతే ఇల్లే ముళ్ల బాటలా అనిపిస్తుంది. కాబట్టి మీ ఇల్లు స్వర్గంలా ఉండాలంటే మీరు రెండు మెట్లు తగ్గి మీ జీవిత భాగస్వామితో మంచి బంధాన్ని పెంపొందించుకోవాలి. మీరు కలిసి వెళ్లే దారిని పూలవనంగా మార్చుకోవాలి. అప్పుడే మీ మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం బాగుంటుంది. ఒకరికొకరు సాయం గా ఉండడం, దయగా ఉండడం ఎంతో ముఖ్యం. అప్పుడే చిన్న చిన్న క్షణాలను కూడా ఆస్వాదించగలరు. ఎప్పుడూ కసురుకోవడం, తిట్టుకోవడం వంటి పనులు చేయడం వల్ల ఇద్దరి సంతోషం ఆవిరి అయిపోతుంది. ఇంటికి రావాలన్న కోరిక కూడా ఇద్దరికీ తగ్గిపోతుంది.

ఏదైనా అంశంలో భాగస్వామితో విభేదించాల్సి వస్తే పరుషమైన మాటలు మాట్లాడకండి. చాలా సున్నితంగానే ఆ విషయాన్ని చెప్పండి. వాదించుకోవడం మొదలుపెడితే అది తెగేదాకా సాగుతూనే ఉంటుంది. ప్రశాంతమైన నిద్ర కూడా ఉండదు. ఒకరి గౌరవానికి ఒకరు భంగం కలిగించుకోవాల్సి వస్తుంది. కాబట్టి మీ బంధం కోసం ఇద్దరిలో ఎవరో ఒకరు తగ్గితే ఎలాంటి ప్రమాదము లేదు. మీరు ఒకవేళ మీ జీవిత భాగస్వామితో ఏకీభవించలేకపోతే ఆ విషయాన్ని అక్కడితో వదిలేయండి. అంతేకానీ వారితో గొడవ పడకండి.

పెళ్లయిన కొత్తలోనే కాదు పెళ్లయి ఏళ్లు గడుస్తున్నా... మీ ప్రేమను మీ జీవిత భాగస్వామికి వ్యక్తీకరించడం చాలా ముఖ్యం. అది మీ మధ్య అనుబంధాన్ని పటిష్టంగా చేయడమే కాదు, తాజాగా ఉంచుతుంది. అలాగే మీ లైంగిక సంబంధాలు కూడా మెరుగ్గా ఉండాలంటే వారానికి ఒకసారి అయినా మీ ప్రేమను వ్యక్తీకరుస్తూ ఉండాలి. వారికి ఇష్టమైన భోజనాన్ని ఆర్డర్ చేయడం, మీ భాగస్వామిని ఆశ్చర్యపరచడం, రొమాంటిక్ సర్ ప్రైజ్‌లు ప్లాన్ చేయడం వంటివి చేస్తూ ఉండండి. మీరు తప్పు చేసినట్లయితే మీ జీవిత భాగస్వామికి క్షమాపణ చెప్పేందుకు వెనుకాడకండి. ఇలా క్షమాపణ చెప్పడం వల్ల మీ స్థాయి తగ్గిపోదు. మీరు ప్రేమించిన వారి దగ్గర రెండు మెట్లు దిగి రావడం వల్ల ప్రేమ పెరుగుతుందే కానీ తరగదు. మీ సంబంధం మరింత బలంగా మారుతుంది. ప్రతి ఒక్కరూ తప్పులు చేస్తారు. ఆ తప్పుల వల్ల ఎదుటి వారు బాధ పడకుండా చూసుకుంటేనే మానవత్వం ఉన్నట్టు. చిన్న చిన్న అంశాలను, చిన్నచిన్న విజయాలను కూడా ఇద్దరూ కలిసి సెలెబ్రేట్ చేసుకోవడం అలవాటు చేసుకోండి. ఇది మీ మధ్య సాంగత్యాన్ని మరింతగా పెంచుతుంది. అలాగే ఒకరికి ఒకరు అండగా ఉండడం అలవాటు చేసుకోండి. జంటగా విజయాలను సాధిస్తే ఆ సంతోషమే వేరు.






# కూతురికి గురువు పాత్రలో బాలీవుడ్ అగ్ర హీరో

అగ్ర హీరో షారుఖ్‌ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ సినీ రంగంలో వడివడిగా అడుగులు వేస్తున్నది. 'ది ఆర్చిస్' చిత్రం ద్వారా ఓటీటీ వేదికపై అరంగేట్రం చేసిన ఆమె ప్రస్తుతం హిందీలో ఓ భారీ సినిమాలో నటించబోతున్నది. 'కింగ్' పేరుతో దర్శకుడు సుజయ్‌ఘోష్ తెరకెక్కించబోతున్న ఈ సినిమాలో షారుఖ్‌ఖాన్ అతిథి పాత్రలో నటించనున్నారని తొలుత వార్తలొచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో షారుఖ్ పూర్తిస్థాయి పాత్రలో నటించనున్నారని, కుమార్తె సుహానాఖాన్‌తో సమాంతరంగా ఆయన పాత్ర సాగుతుందని తెలిసింది. ఈ సినిమాలో వారిద్దరు తండ్రీకూతుళ్లుగా కనిపించబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే అందులో నిజం లేదని.. సుహానాఖాన్‌కు మార్గదర్శనం చేసే శక్తివంతమైన గురువుగా షారుఖ్‌ఖాన్ పాత్ర సాగుతుందని చెబుతున్నారు. 'ఈ సినిమా స్క్రిప్ట్‌లో చాలా మార్పులు చేశాం. సుహానాఖాన్ తొలి థియేట్రికల్ రిలీజ్ కాబట్టి భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నాం. షారుఖ్‌ఖాన్‌తో సమానంగా సుహానాఖాన్ పాత్ర ఉంటుంది' అని చిత్ర బృందం పేర్కొంది. ఆగస్ట్‌లో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది.





# లిమిట్స్ దాటి ప్రవర్తించకు!

సినిమాను తెలిగ్గా జనాల్లోకి తీసుకెళ్లడానికి వినూత్నంగా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఊహించని విధంగా వీధుల్లో కొచ్చేసి అల్లరి చేసేయడం, లైవ్ నడుస్తుంటే యాంకర్‌తో గొడవ పెట్టేసుకోవడం.. ఇలా అన్నమాట. ఇది ముందుగా ప్లాన్ చేసుకొని చేస్తున్న నాటకాలని తెలియని జనం ఆ గొడవని రిపీట్ చేసి చూడటం.. దీంతో సదరు చిత్రానికి ఆటోమేటిగ్గా ప్రచారం లభించడం.. ఇదో కొత్త స్ట్రాటజీ. ఈ పోకడ శృతిమించడంతో.. సాంఘిక మాధ్యమం వేదికగా ఇద్దరు వ్యక్తులకు నిజంగానే గొడవ జరిగినా.. అది కూడా పబ్లిసిటీ స్టంటే అంటున్నారు. రీసెంట్‌గా నభా నటేష్‌కీ, నటుడు ప్రియదర్శికీ ఎక్స్(ట్విటర్) వేదికగా మాటల యుద్ధం జరిగింది. ఈ గొడవ ఇప్పుడు ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నది. వివరాల్లోకెళ్తే.. హీరో ప్రభాస్ వాయిస్‌తో డబ్‌స్మాష్ వీడియోను నభా ఇటీవలే పోస్ట్ చేసింది. ఆ పోస్ట్‌పై స్పందించిన ప్రియదర్శి 'వావ్.. సూపర్ డార్లింగ్.. కిర్రాక్' అంటూ రిప్లై ఇచ్చాడు. దీంతో 'ఐపీసీ సెక్షన్ 354ఏ ప్రకారం పరిచయం లేని ఒక స్త్రీని డార్లింగ్ అని సంభోదించడం లైంగిక వేధింపులతో సమానం' అని రాసి ఉన్న ఒక మెసేజ్‌తో ప్రియదర్శికి రిప్లై ఇచ్చి, 'మిస్టర్.. కామెంట్ చేసే ముందు మాటలు జాగ్రత్త' అని కూడా రాసింది నభా. 'మనకు పరిచయం లేదన్న విషయం నాకు తెలీదు.. మీరైతే డార్లింగ్ అనేయొచ్చు.. మేమంటే సెక్షన్లా?' అంటూ ప్రియదర్శి ఎదురు ప్రశ్నిస్తూ.. లైట్ తీస్కో డార్లింగ్..' అని మరో రిప్లై ఇచ్చాడు. దాంతో నభా కోపం నషాళానికి అంటి.. 'లిమిట్స్ దాటి ప్రవర్తించకు.. తర్వాత చూసుకుందాం' అంటూ సీరియస్‌గా రిప్లై ఇచ్చింది. ప్రస్తుతం ఈ చాటింగ్ వైరల్ అవుతున్నది. నెటిజన్స్ ఎవరికి తోచినట్టు వారు స్పందిస్తున్నారు. కొందరైతే.. వీరిద్దరూ కలిసి సినిమా చేయబోతున్నారనీ, సినిమా పేరు 'డార్లింగ్' అనీ, సినిమా ప్రమోషన్ కోసం జనాన్ని పిచ్చోళ్లని చేస్తున్నారని అభిప్రాయపడుతున్నారు.

# ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో...

'హనుమాన్' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయాన్ని సాధించింది. ఈ చిత్రంతో దర్శకుడు ప్రశాంత్‌వర్మ పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపును సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ఆయన సీక్వెల్ 'జై హనుమాన్' చిత్రంతో బిజీగా ఉన్నారు. తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ అగ్ర హీరో రణవీర్‌సింగ్‌తో ప్రశాంత్‌వర్మ భారీ పాన్‌ఇండియా సినిమాను తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. 'హనుమాన్' సినిమా రణవీర్‌సింగ్‌కు బాగా నచ్చిందని, దాంతో ప్రశాంత్‌వర్మతో సినిమా చేయడానికి ఆయన ఆసక్తిని చూపించారని అంటున్నారు. ఇటీవలే వీరిద్దరి మధ్యలో కథా చర్చలు కూడా పూర్తయ్యాయని, పౌరాణిక నేపథ్యంతో పీరియాడికల్ కథాంశంతో ఈ సినిమా తెరకెక్కనుందని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడుతుందని చెబుతున్నారు. ఇక 'హనుమాన్'కు సీక్వెల్‌గా రూపొందబోతున్న 'జై హనుమాన్' త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.





# విలువలకు.. సిద్ధాంతాలకు కట్టుబడే సినిమాలు తీస్తా..

'ఈ మధ్యే 'హ్యాపీడేస్' చూశాను. ఇప్పటికీ ఫ్రెష్‌గా అనిపించింది. ఈ సినిమాకు అన్నీ కుదిరాయి. రీరిలీజ్ చేస్తే ప్రజెంట్ యూత్ బాగా ఎంజాయ్ చేస్తారు. టైసన్ పాత్ర చాలా మేజిక్‌గా ఉంటుంది' అన్నారు శేఖర్ కమ్ముల. 17ఏళ్ల క్రితం ఆయన దర్శకత్వంలో వచ్చిన సినిమా 'హ్యాపీడేస్'. 2017లో విడుదలైన ఈ సినిమా భారీ విజయాన్ని నమోదు చేసుకోవడమేకాక, అప్పటి యువతరాన్ని ఉర్రూతలూగించింది. శుక్రవారం ఈ సినిమా రీరిలీజ్ కానుండటం, దర్శకుడిగా శేఖర్ కమ్ముల కూడా ఇండస్ట్రీలో 24ఏళ్లు పూర్తి చేసుకోబోతుండటం.. ఈ సందర్భాలను పురస్కరించుకొని ఆయన మీడియాతో ముచ్చటించారు. రెండు దశాబ్దాల పైచిలుకుగా సాగిన తన సినీ ప్రయాణాన్ని చూస్తే గర్వంగా అనిపిస్తుందని, ఏ సినిమా చేసినా చెడు చెప్పకుండా విలువలు, సిద్ధాంతాలకు కట్టుబడి సినిమాలు చేశాననీ, డబ్బు, పేరుకోసం తాను ఈ రంగంలోకి రాలేదని శేఖర్ కమ్ముల పేర్కొన్నారు. కథ విషయంలో ఆలోచన రావడానికి, కార్యరూపం దాల్చడానికి సమయం పడుతుందనీ, వేగంగా సినిమాలు తీయడం కంటే గుర్తుండిపోయే సినిమాలు తీయడం తన అభిమతమని శేఖర్ కమ్ముల చెప్పారు. ధనుష్ సినిమా గురించి మాట్లాడుతూ 'అది పెద్ద స్కేల్ సినిమా. పెద్ద ఐడియాతో ఉండే సినిమా. నాగార్జున, ధనుష్ ఈ కథకు యాప్ట్. ఇంతకంటే ఈ సినిమా గురించి ఎక్కువ చెప్పకూడదు' అన్నారు శేఖర్‌కమ్ముల. 'లీడర్' సీక్వెల్ తీయాలనే ఆలోచన ఉందని, ఆ సినిమా చేస్తే మాత్రం తప్పకుండా రానాతోనే చేస్తానని అన్నారు. 'నేటి రాజకీయాలు మరీ దిగజారిపోయాయి. దీనికి చెప్పే సొల్యూషన్ లాజిక్‌గా ఉండాలి. సమస్య చెబితే పరిష్కారం కూడా చెప్పాలి. దానికి టైం పడుతుంది' అని తెలిపారు శేఖర్‌కమ్ముల.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com